సాక్షి ప్రకాశం

ఆదివారం | 19 | ఫిబ్రవరి | 2023



హరహర మహాదేవ

జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలన్నీ శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. - 8లో..



సత్తాచాటిన నంద్యాల జిల్లా ఎడ్లజతలు

రాచర్ల మండలం గుడిమెట్టలో రాష్ట్రస్థాయి ఎడ్లపందేల్లో నంద్యాల జిల్లా ఎడ్ల జతలు సత్తా చాటాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం 31 /20

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రికి చల్లని గాలులు వీస్తాయి.

పాహిమాం.. పరమేశ్వరా..

లయకారుడు..భక్తజన సులభుడు..ఆది మధ్యాంత రహితుడైన పరమశివుడు లింగరూపధారిగా ఉద్భవించిన మహాశివరాత్రి పర్వదినాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహాశివరాత్రి, శనిత్రయోదశి రెండూ ఒకేసారి రావడంతో శైవక్షేత్రాలన్నీ భక్తజన సంద్రాలయ్యాయి. త్రిపురాంతకం, భైరవకోన, మిట్టపాలెం, జమ్ములపాలెం, మదనూరు, సంగమేశ్వరం, అనుమనగిరి, రామతీర్థం, సిద్దేశ్వరం, సత్యవోలు వంటి శైవక్షేత్రాల్లో వేకువజాము నుంచే మహాశివుని దర్శనం కోసం భక్తులు బారులుతీరారు. పరమేశ్వరా పాహిమాం అంటూ..శివనామస్మరణతో పులకించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, శివకల్యాణాలు జరిపించారు. ఉపవాస దీక్షలతో భక్తిపారవశ్యంతో అర్చించారు.

- సాక్షి నెట్‌వర్క్



ఒంగోలు సంతపేటలోని శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, శచీదేవి దంపతులు



ఒంగోలులోని కేశవస్వామిపేట శివాలయం వద్ద క్యూలో వేచి ఉన్న భక్తులు



త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వర స్వామిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు




భైరవకోనలో జలపాతం వద్ద స్నానం చేస్తున్న భక్తులు



ఒంగోలులోని సంతపేట సాయిబాబా మందిరంలోని శివాలయంలో స్వామిని దర్శించుకుంటున్న యువతి



భైరవకోనలో త్రిముఖ దుర్గాంబిక, భైరవేశ్వర స్వామి



భక్తులతో కిటకిటలాడుతున్న రామతీర్థంలోని మోక్ష రామలింగేశ్వరస్వామి ఆలయం



త్రిపురాంతకేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్



జమ్ములపాలెంలో 1116 శివలింగాలను దర్శించుకుంటున్న భక్తులు



భైరవకోనలో స్వామి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

నేడు ఎస్ఐ ఉద్యోగాలకు రాత పరీక్షలు

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఎస్ఐ ఉద్యోగాలకు నిర్వహిస్తున్న రాత పరీక్షలకు అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలులోని పేస్ ఇంజినీరింగ్ కాలేజీలోని 2 సెంటర్లు, రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలోని 3 సెంటర్లు, క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలోని 3 సెంటర్లలో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పేపర్-1 పరీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం గం.2.30 నుంచి గం.5.30 వరకు పేపర్-2 పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో 8039 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఎన్‌క్వాస్ టీమ్ తనిఖీలు

మద్దిపాడు: ఎన్‌క్వాస్ (నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్డ్) ను పరిశీలించడానికి వచ్చిన కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ ప్రీతి మదన్, డాక్టర్ భరణీ కుమార్ అన్‌బలగన్‌లు రెండో రోజు శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలోని లేబర్ రూమ్‌లో స్టాఫ్ నర్సులతో డాక్టర్ ప్రీతి మదన్ మాట్లాడుతూ లేబర్ రూమ్ నిర్వహణ స్థాయి గురించి, ప్రసవం అయ్యాక తల్లి బిడ్డలకు ఇచ్చే రక్షణ గురించి ప్రశ్నించారు. తల్లి బిడ్డకు ఇచ్చే కార్డులు పరిశీలించి అందులో ఆధార్ నంబర్ నమోదు చేస్తున్నారా లేదా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులతో పాటు, కంప్లెంట్ బాక్స్‌లో వచ్చిన ఫిర్యాదులను, వాటికి సంబంధించిన ఫైలును తనిఖీ చేశారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల గురించి డాక్టర్ మానసను అడగడంతో ఆమె కంప్లెయింట్ బాక్స్‌ను రోజూ తెరుస్తామని మరుసటి రోజుకు ఆయా పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో సిబ్బందితో వారు తాము గమనించిన చిన్నచిన్న లోపాలను ప్రస్తావించారు. వాటిని కూడా సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన తనిఖీలకు సంబంధించిన రిపోర్టును కేంద్ర కమిటీకి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజలకు అర్థమయ్యేలా ఆస్పత్రిలో స్థానిక భాషలో ఉండే బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వారి వెంట ఆస్పత్రి డాక్టర్‌లు మానస ఆనందమోహన్, జిల్లా టీమ్ సభ్యులు కృష్ణప్రసాద్, మురళి ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.



పీహెచ్‌సీ స్టాఫ్ నర్సులను ప్రశ్నిస్తున్న డాక్టర్ ప్రీతి మదన్

క్లుప్తంగా

22న నూర్‌బాషా రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ఒంగోలు: నూర్‌బాషా రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ గవర్నర్‌పేటలోని హోటల్ స్వర్ణప్యాలెస్‌లో నిర్వహించనున్నట్లు నూర్‌బాషా రాష్ట్ర యువజన అధ్యక్షుడు డాక్టర్ శ్రీనుబాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర నూర్‌బాషా ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఓతూరి రసూల్‌సాహెబ్ హాజరవుతారని, రాష్ట్ర కమిటీ సభ్యులు, అన్ని జిల్లాల కమిటీల పెద్దలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

అటవీశాఖ అధికారులకు తుపాకులు అందజేత



అటవీశాఖ అధికారులతో ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్

మార్కాపురం: నాగార్జున సాగర్–శ్రీశైలం పెద్ద పులుల అభయారణ్యం మార్కాపురం అటవీ డివిజన్ పరిధిలోని అటవీ అధికారులకు ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్ శనివారం తుపాకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాకులు ఇవ్వటం వలన రేంజ్ స్థాయి సిబ్బంది సమర్థవంతంగా అడవులు, వన్య ప్రాణుల రక్షణలో పని చేయటానికి మరింత అవకాశం ఉంటుందని అన్నారు. డిప్యూటీ రేంజ్ అధికారులు అరిఫ్ ఖాన్, ముక్కు ప్రసాద్ రెడ్డి, రామ్మోహన్‌రావు, సెక్షన్ అధికారులు చెన్నయ్య, శ్రీను, అటవీ బీటు అధికారులు వెంకటేశ్వర్లు, భాను ప్రసాద్, రోశయ్య, గురవయ్య ధనలక్ష్మిలకు తుపాకులను అందించారు.

లారీ గేర్ రాడ్‌పై పడి వ్యక్తి మృతి

మార్కాపురం: లారీ గేర్ రాడ్‌పై పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మార్కాపురం మండలం చింతగుంట్ల వద్ద జరిగింది. రూరల్ ఎస్సై సుమన్ తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ బాషా (47) లారీ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17 న మహబూబ్ బాషా, గుప్త విజయ్ కుమార్ లారీకి డ్రైవర్లుగా కర్ణాటకకు వెళ్లి అక్కడ పలకల చెక్క రీపర్స్ లోడ్ చేసుకొని శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మార్కాపురం మండలం చింతకుంట గ్రామం దగ్గరకు వచ్చేసరికి గుప్త విజయకుమార్ లారీ నడుపుతుండగా లారీకి గేదె అడ్డుగా రావడంతో సడన్ బ్రేక్ వేశాడు. దీంతో మహబూబ్ బాషా లారీ గేర్ రాడ్‌పై పడడంతో ఛాతీ నొప్పి వచ్చింది. వెంటనే చూడగా మృతి చెందినట్లు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

హరహర మహాదేవ

- భక్తులతో పోటెత్తిన శైవ క్షేత్రాలు
- శివరాత్రి వేడుకల్లో పాల్గొన్న భక్తజన సందోహం
- భైరవకోన, త్రిపురాంతకం, జమ్ములపాలెంలో ఆధ్యాత్మిక శోభ



జమ్ములపాలెంలో పూజలందుకుంటున్న పంచముఖేశ్వరుడు



త్రిపురాంతకేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, నేతలు



ఒంగోలులోని సంతపేట సాయిబాబా ఆలయంలో శివకల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని దంపతులు



భైరవకోనలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి, చింతలచెరువు సత్యనారాయణరెడ్డి దంపతులు



గిద్దలూరులోని పాతాళనాగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అన్నా



త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్త జనులు

సీఎస్‌పురం: ప్రముఖ పర్యాటక శైవక్షేత్రం భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి ఆలయాలు శనివారం శివ నామస్మరణతో హోరెత్తి పోయాయి. శనివారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి భక్తులు భైరవకోన, నారాయణస్వామి ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. భైరవకోనలో జలపాతాన్ని సందర్శించి అష్ట గుహాలయంలో ఉన్న త్రిముఖ దుర్గాదేవి, భర్గలేశ్వర, నగరేశ్వర, కాల భైరవ తదితర అష్ట శివలింగాలకు పూజలు చేశారు. భైరవకోనలో ఆలయ పూజారులు కంబాలదిన్నె వెంకటనర్సయ్య, పంచాగ్నుల రామమూర్తి శర్మ, సుధాకర్ శర్మ, నారాయణస్వామి ఆలయంలో ఆలయ పూజారులు సత్యనారాయణ శర్మ, ప్రసాద శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్‌లు దుగ్గిరెడ్డి జయరెడ్డి, సిద్దు రమణారెడ్డి, సిద్దు వెంకటరెడ్డి, ముడుమాల నారాయణ రెడ్డి, ఆలయాల ట్రస్టుబోర్డు సభ్యులు భక్తులకు వసతి సౌకర్యాలు సమకూర్చారు.

పుణ్యక్షేత్రాలను సందర్శించిన ప్రముఖులు

భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి ఆలయాలను ప్రముఖులు సందర్శించి పూజలు చేశారు. టీటీడీ పాలక మండలి సభ్యులు, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి దంపతులు, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి తదితర ప్రముఖులు పూజలు చేశారు. ఆయా ఆలయాల ట్రస్టుబోర్డు చైర్మన్లు దుగ్గిరెడ్డి జయరెడ్డి, సిద్దు రమణారెడ్డి, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భైరవకోనలోని గురుసదన్‌లో నూతనంగా ప్రతిష్ఠించిన వినాయకుడు, అభయాంజనేయ స్వామి, శివలింగాలకు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. నారాయణ స్వామి ఆలయం వద్ద కనిగిరి బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలు భక్తులకు ఆకట్టు కున్నాయి. ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మేకల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీలు దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, భూమిరెడ్డి ప్రభంజన వెంకటరెడ్డి, భువనగిరి వెంకటయ్య, పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, షేక్ బుజ్జి గంగసాని హుస్సేన్ రెడ్డి తదితరులు పూజలు చేశారు. కార్యనిర్వహణాధికారులు నర్రా నారాయణరెడ్డి, ఆలయాల ట్రస్టుబోర్డు చైర్మన్‌లు దుగ్గిరెడ్డి జయరెడ్డి, సిద్దు రమణారెడ్డి, ఆలయాల పూజారులు ప్రముఖులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జమ్ములపాలెంలో 1116 శివలింగాలకు పూజలు

టంగుటూరు: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల శివాలయాలు శివ నామ స్మరణతో మారుమోగాయి. జమ్ములపాలెంలోని 108 శక్తి పీఠ సమేత 1116 శివలింగాల ఆలయంలో పంచముఖేశ్వరుడుకి పంచామృత అభిషేకాలు, తులసి పూజలు, తదితర విశిష్ట పూజలు నిర్వహించారు. 1116 శివలింగాల చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. అన్నపూర్ణ సమేత కాశీవిశ్వర స్వామికి పంచామృత అభిషేకం నిర్వహించి, స్వామివారి కళ్యాణం, భక్తులకు అన్నదానం చేసి, ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. పసుకుదురులో సాక్షాత్తు శ్రీరామ చంద్రుడు పతిష్ఠించి పురాతన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేలాది భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

నలుమూలల నుంచి వచ్చిన భక్తులు

త్రిపురాంతకం: హరహర మహాదేవ శంభో శంకర అంటూ పార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి వారి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. వేలాదిగా తరలివచ్చిన భక్తజనులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. త్రిపురాంతకం శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి, శ్రీబాలాత్రిపురసుందరీదేవి అమ్మ వారి ఆలయాలు కిక్కిరిశాయి. స్వామి అమ్మవార్లకు భక్తులు అభిషేకాలు, కుంకుమార్చనలను అర్చకులు విశ్వనారాయణ శాస్త్రి, ప్రసాదశర్మ ఆధ్వర్యంలో చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఈఓ చెన్నకేశవరెడ్డి తగిన చర్యలు తీసుకున్నారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పద్మజ మల్లికార్జున్, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మంత్రి సురేష్ పూజలు

త్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆర్‌టీ యాక్ట్ కమిషనర్ చెన్నారెడ్డి, మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతుమాధవన్ కుటుంబ సమేతంగా వచ్చి పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆర్. సుశీల వెంకట పిచ్చయ్య, ఎంపీపీలు కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్ పాల్, మార్కెట్ యార్డు చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, శ్రీధర్, అడిషనల్ ఎస్పీ శ్రీధర్, డీఎస్పీలు కిషోర్, నారాయణస్వామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్. పోలిరెడ్డి, యల్లారెడ్డి, దగ్గుల గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



తర్లుపాడు మండలంలోని కేతగుడిపిలోని కేదారేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ దంపతులు



భైరవకోన గురుసదన్‌లో నూతనంగా ప్రతిష్ఠించిన శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బుర్రా



రుద్రాక్షల పందిరి అలంకరణలో వెలుగులు చిమ్ముతున్న ఒంగోలులోని సంతపేట సాయిబాబా ఆలయంలో ఉన్నశివాలయం



త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వర ఆలయానికి మెట్లమార్గంలో వెళుతున్న భక్తులు

సత్తాచాటిన నంద్యాల జిల్లా ఎడ్ల జతలు

రాచర్ల: మండలంలోని గుడిమెట్ట పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామ సమీపంలోని సిద్ది భైరవేశ్వరస్వామి వారి మహాశివరాత్రి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు ఉల్లాసంగా సాగాయి. ఈ రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలను ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు చేతులు మీదుగా రిబ్బన్ కట్ చేసి పందాలను ప్రారంభించారు. నంద్యాల జిల్లా, నంద్యాల మండలం, బిల్లలాపురం గ్రామానికి చెందిన భూమా గోవర్దన్ రెడ్డికు చెందిన ఎడ్లు నిర్ణీత 15 నిమిషాల్లో 1621 అడుగులు లాగి మొదటి బహుమతి సాధించాయి. వైఎస్సార్ జిల్లా, కాశినాయన మండలం, అనవారిపల్లె గ్రామానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లు రెండు, బేస్తవారిపేట మండలం, జేసీ అగ్రహారం గ్రామానికి చెందిన లక్కు సాయిసాత్విక్ చెందిన ఎడ్ల జతలు మూడు, పెద్దరావీడు మండలం, సుంకేసుల గ్రామానికి చెందిన ముద్దపాటి శ్రీనివాసుల చెందిన ఎడ్ల జతలు నాలుగో స్థానంలో నిలిచాయి. రూ. 50వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 10 వేలను వరుస బహుమతులుగా ఎడ్ల యజమానులకు అందించారు. దేవస్థానం ధర్మకర్త మధిరె శ్రీరంగారెడ్డి, ఉప దర్మకర్త శ్రీరంగపు వెంకట నారాయణరెడ్డి, ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు కుమారుడు అన్నా కృష్ణచైతన్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



రామాపురంలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు



గిద్దలూరు: ఎడ్ల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే



చిన్న కంభం పోటీల్లో బండలాగుతున్న ఎడ్లు

ఎడ్లపోటీల విజేతలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు

గిద్దలూరు రూరల్: మహా శివరాత్రి పండుగ సందర్భంగా పట్టణంలోని పాతాళనాగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో శనివారం నిర్వహించిన ఎడ్ల పోటీలలో గెలుపొందిన విజేతలకు స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన తేజశ్రీ ఎడ్లు 3480 అడుగులు బండను లాగి మొదటి స్థానం, చాపాడు మండలం వీరతేజ ఎడ్లు 3005 అడుగులు లాగి రెండు, నంద్యాల జిల్లా కుమ్మలూరు గ్రామానికి చెందిన బీఎస్ఆర్ పల్లవిక ఎడ్లు మూడు, వైఎస్సార్ జిల్లా రాజుపాలెంకు చెందిన బండి వెంకటశివారెడ్డి ఎడ్లు నాలుగు, కంభం మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన వెంకటగిరి హేమలతా నాయుడు ఎడ్లు ఐదో స్థానంలో నిలిచాయి. రూ. 50 వేలు, రూ. 40 వే లు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 10 వేలు వరుస బహుమతులు అందించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాతాళనాగేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర్ధవీడు ఎడ్లు..

కంభం: మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని చిన్నకంభం వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో అర్ధవీడు మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన సోమిశెట్టి రమేష్ ఎడ్లు 2730.10 అడుగులు లాగి ప్రథమస్థానంలో సత్తాచాటాయి. వైఎస్సార్ కడపజిల్లా, దాసరి పల్లి గ్రామానికి చెందిన శీలం రమేష్ ఎడ్లు, వైఎస్సార్ కడప జిల్లా కలసపాడుకు చెందిన శంకరయ్య యాదవ్ ఎడ్లు, కంభం మండలం ఔరంగబాదు గ్రామానికి చెందిన అంబరపు రామోజి, యరగొండపాలెంకు చెందిన శ్రీనివాసరెడ్డి ఎడ్లు, వైఎస్సార్ జిల్లా పెద్దజొన్నవరానికి చెందిన కాకి యుగంధర్ ఎడ్లు, అర్ధవీడు మండలం బొల్లుపల్లి గ్రామానికి చెందిన సింగారెడ్డి శ్రీనివాసరెడ్డి ఆ తరువాత స్థానాల్లో నిలిచాయి. రూ. 30వేలు, 25వేలు, 20వేలు, 15వేలు, 10వేలు, 6వేలు అందజేశారు.

బావిలో పడి గ్రానైట్ కార్మికుడు మృతి



బావిలో పడి చనిపోయిన గ్రానైట్ కార్మికుడు

బల్లికురవ: బతుకుదెరువుకు రాష్ట్రాలు దాటి వచ్చిన గ్రానైట్ కార్మికుడు బావిలో పడి చనిపోయాడు. ఈ ఘటన శనివారం బాపట్ల జిల్లా బల్లికురవ మండలంలోని వేమవరం జంక్షన్ సమీపంలో వెలుగు చూసింది. బల్లికురవ పోలీసుల వివరాల మేరకు.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన హరేరామ్ విచర్ (32) పదిరోజుల క్రితం మార్టూరు మండలం నాగరాజుపల్లె గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేసేందుకు వచ్చాడు. గురువారం సాయంత్రం బల్లికురవలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేసేందుకు వెళ్తున్నానని తోటి కార్మికులకు చెప్పాడు. రెండు రోజులైనా కానరాకపోవటంతో తోటి కార్మికులు భయాందోళనకు గురయ్యారు. శనివారం వేమవరం జంక్షన్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వెనుకభాగంలోని బావిలో శవం ఉందని తెలియడంతో గ్రానైట్ కార్మికులంతా వచ్చి చూశారు. ఈవిషయం గ్రానైట్‌లో పనిచేస్తున్న కార్మికులకు తెలియటంతో వారు వచ్చి చూసి హరేరామ్‌గా గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యం సేవించి ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడ్డాడని తోటి కార్మికులు భావిస్తున్నారు. బల్లికురవ ఎస్సై వేమన, కేసు నమోదుతో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వ్యవసాయ కార్మిక సంఘ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా కంకణాల



కంకణాల ఆంజనేయులు

ఒంగోలు టౌన్: వ్యవసాయ కార్మిక సంఘ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా కంకణాల ఆంజనేయులు ఎన్నికయ్యారు. కోల్‌కతాలో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ జాతీయ 10వ మహాసభల్లో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ప్రస్తుతం ప్రకాశం జిల్లా కార్యదర్శిగా వ్యవహరిస్తున్న తనను జాతీయ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నుకున్నట్లు ఆంజనేయులు తెలిపారు. మూడేళ్లుగా దేశవ్యాప్తంగా నిర్వహించిన ఉద్యమాలు, పోరాటాలపై సమీక్షించి భవిష్యత్తు ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగం, నిర్వీర్యం అవుతున్న ఉపాధి హామీ పథకం, దళితులు, గిరిజనులు, మహిళలు, ముస్లిం మైనార్టీలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. మహాసభల్లో ప్రకాశం జిల్లా నుంచి నెరసుల వెంకటేశ్వర్లు, ఉసా వెంకటేశ్వర్లు ప్రతినిధులుగా హాజరైనట్లు తెలిపారు.